సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం ౹ 3 ౹ ఏప్రిల్ ౹ 2025



ఆదాయం అదుర్స్
జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్లు గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన రూ.21.69 కోట్ల లక్ష్యాన్ని అధిగమించాయి. 8లో



విద్యుదుత్పత్తిలో భేష్
గత ఆర్థిక సంవత్సరం విద్యుత్ ఉత్పత్తిలో కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారం జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. 8లో



వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉన్నా.. రాత్రికి చలి వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సార్వభౌమ సేవ

బ్రహ్మోత్సవాల్లో నేడు ధ్వజపట లేఖనం



సార్వభౌమ వాహనంపై తిరువీధి సేవ..

భద్రాచలం: శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యకు వైభవంగా సార్వభౌమ సేవ నిర్వహించారు. అంతకుముందు ఉత్సవ మూర్తులకు బేడా మండపంలో స్నపన తిరుమంజనం గావించారు. సాయంత్రం స్వామివారిని సార్వభౌమ సింహాసనంపై ఆశీనులను చేసి తాతగుడి సెంటర్‌లోని గోవిందరాజ స్వామి వారి ఆలయం వరకు తిరువీధి సేవ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం గరుడాధివాసం, ధ్వజపట లేఖనం తదితర కార్యక్రమాలు ఉంటాయని అర్చకులు తెలిపారు.

రామాలయంలో గోటి తలంబ్రాల సమర్పణ



తలంబ్రాలు అందజేస్తున్న సంఘం సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం సభ్యులు బుధవారం కోటి గోటి తలంబ్రాలు సమర్పించారు. ఎకరం పొలంలో పండించిన ధాన్యాన్ని ఐదువేల మంది భక్తులతో ఒలిపించిన ఎనిమిది క్వింటాళ్ల తలంబ్రాలను అందజేశారు. ముందుగా వాటికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణం అప్పారావు, ఆలయ పీఆర్‌ఓ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి లక్ష కుసుమార్చన



అమ్మవారికి కుసుమార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : శ్రీదేవి వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం పెద్దమ్మతల్లి అమ్మవారికి లక్ష కుసుమార్చనను వైభవంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు నాదనీరాజనం, సూక్తి పారాయణం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీచక్రార్చన, శ్రీలలితా సహస్ర నామ హవనం తదితర పూజలు చేశారు. ఆ తర్వాత అమ్మవారికి నివేదన, హారతి సమర్పించి మంత్రపుష్పం పఠించారు.

రామయ్యను దర్శించుకున్న దేవనాథ జీయర్



రామాలయంలో ప్రదక్షిణ చేస్తున్న జీయర్ స్వామి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని త్రిదండి దేవనాథ జీయర్ స్వామి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జీయర్‌స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు.

తాగునీటికి ఇబ్బంది లేదు

అశ్వాపురం : మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరాకు ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బంది లేదని ఉమ్మడి జిల్లా ఎస్‌ఈ జి.శేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కుమ్మరిగూడెం ఇన్‌టేక్ వెల్, దుమ్ముగూడెం ఆనకట్ట, రథంగుట్ట వద్ద వాటర్‌ట్రీట్ మెంట్ ప్లాంట్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఆనకట్ట, ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి నీటిమట్టాన్ని పరిశీలించారు. నీటి మట్టం తగ్గితే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ నళిని, డీఈ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు నిరాశేనా..?



రామయ్య కల్యాణం జరిగే మిథిలా స్టేడియం

రామయ్య కల్యాణాన్ని వీక్షించడం కష్టమే..

- వీవీఐపీల తాకిడితో ఉభయదాతల టికెట్ల కుదింపు
- మిథిలా స్టేడియంలో సామాన్యులకు తప్పని ఇక్కట్లు
- సరిపడా ఏర్పాటు చేయని ఎల్‌ఈడీ స్క్రీన్‌లు


భద్రాచలం: శ్రీరామనవమి రోజున రామయ్య కల్యాణ ఘట్టం టీవీల్లో కనిపించినా, రేడియోలో వ్యాఖ్యానం వినిపించినా.. భద్రాచలం మిథిలా స్టేడియంలో ప్రత్యక్షంగా వీక్షించాలనేది భక్తుల కోరిక. ఆ ఆశతో భద్రాచలం వచ్చే చాలా మందికి నిరాశే ఎదురవుతోంది. వీవీఐపీ, వీఐపీ సెక్టార్లలో మినహా ఇతర సెక్టార్లలో, సామాన్య భక్తులు ఉచితంగా కూర్చునే షెడ్లలో పూర్తి స్థాయిలో ఎల్‌ఈడీలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో వేదికకు దూరంగా ఉన్నవారు కల్యాణ తంతును కనులారా వీక్షించలేని పరిస్థితి నెలకొంటోంది. దీనికి తోడు ప్రతి ఏడాదీ వీవీఐపీ, వీఐపీల తాకిడి పెరుగుతుండగా ఇతర సెక్టార్ల టికెట్లను కుదించే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ ఏడాది శ్రీరామనవమికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానుండగా మంత్రులు, ఎమ్మెల్యేలు, వీవీఐపీలు, వీఐపీల తాకిడి పెరగనుంది. దీంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ రెండు రోజులుగా భద్రాచలంలోనే ఉండి ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. సీఎం, వీవీఐపీల సెక్టార్లను పెంచాలని దేవస్థానం అధికారులకు సూచించారు. దీంతో 1000 టికెట్లు గల ఉభయదాతల సెక్టార్‌ను 775కు కుదించారు. వీఐపీ సెక్టార్‌ను సైతం కుదిస్తున్నారు. ఇలా ప్రతి ఏడాది వీవీఐపీలు, వీఐపీల రాకతో ఇతర సెక్టార్ల విభజన జరుగుతోంది. దీనికి ప్రత్యామ్నాయంగా స్టేడియాన్ని పునర్నిర్మిస్తే శాశ్వత రీతిలో సెక్టార్లను విభజించే అవకాశం ఉంటుంది. తద్వారా భక్తులందరికీ స్వామివారి కల్యాణ దర్శన భాగ్యం దక్కుతుంది.

స్టేడియాన్ని పునర్నిర్మిస్తే భేష్..

ప్రస్తుతం ఉన్న మిథిలా స్టేడియాన్ని 1964లో నాటి సీఎం నీలం సంజీవ రెడ్డి ప్రారంభించగా మూడు వైపులా అదనపు గ్యాలరీలను 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ ప్రారంభించారు. అయితే అప్పటికి ఇప్పటికీ భక్తుల సంఖ్య భారీగా పెరుగడంతో అవి ఎటూ సరిపోవడం లేదు. దీనికి తోడు 2027లో గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. ఆ సమయానికైనా మిథిలా స్టేడియాన్ని పునర్నిర్మిస్తే బాగుంటుందని భక్తులు అంటున్నారు.

ఎల్‌ఈడీలైనా పెంచాలి..

మిథిలా స్టేడియంలో ప్రస్తుతం వీవీఐపీ, వీఐపీ, ఉభయదాతలకు కలిపి సుమారు 13 వేల టికెట్లు విక్రయిస్తున్నారు. స్టేడియానికి మూడు వైపులా ఏర్పాటు చేసిన ఉచిత గ్యాలరీల్లో మరో 15 వేల మంది భక్తులు కూర్చునే అవకాశం ఉంది. అంతేకాక చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ పలువురు నిల్చుని కల్యాణాన్ని చూస్తుంటారు. స్టేడియం మధ్య భాగంలో కల్యాణ మండపం ఉంటుంది. సుమారు రెండున్నర ఎకరాల్లో కూర్చునే వారందరికీ కల్యాణ తంతు కనిపించడం కష్టమే అయినా దూరంగా చూస్తూనే అనేక మంది భక్తి పారవశ్యంలో మునిగి తేలుతుంటారు. అయితే స్టేడియంలో కూర్చునే 13 వేల మంది కోసం 30 ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తుండగా.. ఉచిత గ్యాలరీల్లో కూర్చునే 15 వేల మందికి 15 టీవీలను మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. వీటి సంఖ్య పెంచాలని భక్తులు కోరుతున్నారు.



అందరికీ సరిపడా వసతులు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీధర్, పక్కన కలెక్టర్, పీఓ తదితరులు

- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్

భద్రాచలం: శ్రీరామనవమికి భద్రాచలం వచ్చే భక్తులందరికీ సరిపడా వసతులు కల్పిస్తున్నామని దేవాదాయ శాఖ కమిషనర్ ఈ శ్రీధర్ తెలిపారు. స్థానిక సబ్ కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణం ప్రత్యేకమని, అందుకే దేశ వ్యాప్తంగా భక్తులు ఇక్కడికి వస్తుంటారని చెప్పారు. అందరికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని, చలువ పందిళ్లు, ఎండ నుంచి ఉపశమనం కలిగేలా మిస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. 26 సెక్టార్లు ఏర్పాటు చేస్తుండగా అన్నింటిలోనూ ఎల్‌ఈడీ టీవీలు అందుబాటులో ఉంటాయన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. ఉత్సవాల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. కల్యాణం టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భక్తులకు తలంబ్రాలు అందించేందుకు 80 కౌంటర్లు ఏర్పాటు చేశామని, ఆర్టీసీ బస్సుల్లోనూ ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. సీఎం రాక కోసం మూడు హెలీప్యాడ్లు సిద్ధం చేస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు నిరంతర విద్యుత్ సరఫరా కోసం జనరేటర్లు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీఓ దామోదర్ రావు, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న కమిషనర్

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారిని దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వేద పండితులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనుబంధ ఆలయాలనూ దర్శించుకోగా అధికారులు స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు.

కల్యాణ క్రతువు నిర్వాహకులు వీరే..

భద్రాచలం: శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం మహోత్సవాలతో పాటు ఇతర పూజాది కార్యక్రమాల్లో వైదిక పెద్దలు కీలక పాత్ర పోషిస్తారు. ప్రతి ఏడాది రొటేషన్ పద్ధతిలో అందరికీ అవకాశం కల్పించేలా వీరికి ఆయా బాధ్యతలు అప్పగిస్తారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో అధ్వర్యులుగా అమరవాది విజయరాఘవన్(ప్రధానార్చకులు), కోటి రామస్వరూప రాఘవాచార్యులు(ప్రధానార్చకులు), కేఈ స్థలశాయి(స్థానాచార్యులు) వ్యవహరించనున్నారు. బ్రహ్మగా అమరవాది శ్రీనివాస రామానుజం, మంత్ర పఠనం కోటి శ్రీమన్నారాయణాచార్యులు, ప్రధాన రుత్వికులుగా అమరవాది మురళీకృష్ణమాచార్యులు, రుత్వికులుగా పొడిచేటి రామభద్రాచార్యులు, అమరవాది వెంకట్రామన్, అలంకార రుత్వికులుగా అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, అమరవాది శ్రీకాంతాచార్యులు విధులు నిర్వహించనున్నారు.

ప్రారంభానికి మ్యూజియం సిద్ధం



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: ఐటీడీఏ ప్రాంగణంలో నిర్మించిన గిరిజన మ్యూజియం ప్రారంభానికి సిద్ధంగా ఉందని పీఓ బి.రాహుల్ తెలిపారు. యూనిట్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్ల గురించి అందరికీ తెలిసేలా మ్యూజియంలో సుందర దృశ్యాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఈనెల 6న మ్యూజియాన్ని ప్రారంభించనుండగా ఈలోగా జీసీసీ, వ్యవసాయ ఉత్పత్తుల వివరాలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, అధికారులు చంద్రశేఖర్, సున్నం రాంబాబు, ఉదయభాస్కర్, ఉదయ్ కుమార్, రమణయ్య, అశోక్ కుమార్, గోపాలరావు, నరేష్, వేణు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

అగ్నిమాపక సిబ్బందికి విపత్తు నిర్వహణ డీజీపీ సూచన



భవనం కూలిన ప్రాంతంలో అధికారులతో మాట్లాడుతున్న నాగిరెడ్డి

భద్రాచలంఅర్బన్ : వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని, ఈ ఘటనల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర విపత్తు, అగ్నిమాపక శాఖ డీజీపీ వై.నాగిరెడ్డి సూచించారు. భద్రాచలంలో బుధవారం ఆయన పర్యటించారు. ఇటీవల ఐదంతస్తుల భవనం కుప్పకూలి ఇద్దరు కూలీలు మృతిచెందిన ప్రాంతాన్ని పరిశీలించారు. శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులను వెలికి తీసేందుకు అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ అధికారులు, సిబ్బంది తీసుకున్న చర్యలు, ఉపయోగించిన సామగ్రి తదితర వివరాలపై ఆరా తీశారు. అనంతరం అగ్నిమాపక కేంద్రానికి చేరుకుని సిబ్బంది సరిపడా ఉన్నారా? పట్టణ ప్రజలను ఆపద నుంచి రక్షించేందుకు అవసరమైన అన్ని పరికరాలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా అవసరాలుంటే నివేదిక సమర్పించాలని సూచించారు. ఈ నెల 6, 7 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, పట్టాభిషేకం వేడుకల సందర్భంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని, వేడుకల్లో ఎలాంటి అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జిల్లా అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి క్రాంతి, భద్రాచలం టౌన్ సీఐ రమేష్, భద్రాచలం అగ్నిమాపక శాఖ ఎస్‌ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 72 మి.టన్నులు

సింగరేణి(కొత్తగూడెం): 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి 11 ఏరియాల్లో కలిపి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు ఏరియాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. ఇందులో అత్యధికంగా కొత్తగూడెం ఏరియాకు 156.06 లక్షల టన్నులు, మణుగూరు ఏరియాకు 114.90 లక్షల టన్నుల లక్ష్యాన్ని కేటాయించారు. ఇక ఇల్లెందు ఏరియాకు 5 లక్షల టన్నులు, ఆర్జీ–1 ఏరియాకు 4.49, ఆర్జీ–2 ఏరియాకు 9.87, ఆర్జీ–3 ఏరియాకు 6.50, ఆండ్రియాల ప్రాజెక్ట్‌కు 1.55, బెల్లంపల్లి ఏరియా 3.50, మందమర్రి ఏరియాకు 2.78, శ్రీరాంపూర్ ఏరియాకు 6.51, భూపాలపల్లి ఏరియాకు 4.65 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు సంస్థ ఉన్నతాధికారులు వెల్లడించారు.

ముగిసిన ‘పది’ పరీక్షలు



కొత్తగూడెంఅర్బన్: గత నెల 21న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిశాయి. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరా చారి తెలిపారు. చివరి రోజు సోషల్ పరీక్షకు 12,273 మంది విద్యార్థులకు 12,240 మంది హాజరయ్యారని, 33 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. సప్లిమెంటరీ విద్యార్థులు 26 మందికి 17 మంది హాజరయ్యారని తెలిపారు. తాను రెండు కేంద్రాల్లో, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆరు సెంటర్లలో, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది 26 కేంద్రాల్లో తనిఖీ చేసినట్లు వివరించారు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, ఏడు కేంద్రాల్లో గురువారం ఒకేషనల్ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

తునికాకు సేకరణపై చిగురిస్తున్న ఆశలు

జిల్లాలో పలు యూనిట్ల ఖరారు



తునికాకు సేకరిస్తున్న కూలీలు (ఫైల్)


పాల్వంచరూరల్: ఎట్టకేలకు ఈ ఏడాది తునికాకు సేకరణకు ఆశలు చిగురిస్తున్నాయి. తునికాకు సేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మూడు సార్లు ఆన్‌లైన్‌లో టెండర్లు ఆహ్వానించగా భద్రాద్రి జిల్లాలోని 31 యూనిట్లకు 26 యూనిట్లలో ఖరారయ్యాయి. ఫిబ్రవరి 27, 28, మార్చి 10, 11వ తేదీల్లో 20, 21వ తేదీల్లో మూడు దఫాలుగా టెండర్లు ఆహ్వానించారు. జిల్లాలో ఈ ఏడాది 17,200 స్టాండర్డ్ బ్యాగ్‌ల తునికాకు సేకరణ లక్ష్యంగా నిర్దేశించారు. ఈ మేరకు భద్రాచలం డివిజన్‌లో ఐదు యూనిట్లకు గాను మూడు, మణుగూరు డివిజన్‌లోని ఐదుకు ఐదు, పాల్వంచ డివిజన్‌లో నాలుగుకు నాలుగు, వైల్డ్‌లైఫ్ డివిజన్ పరిధిలో ఐదు యూనిట్లకు ఐదు, కొత్తగూడెం డివిజన్ పరిధిలో నాలుగుకు ఒకటి, ఇల్లెందు డివిజన్‌లో ఎనిమిది యూనిట్లకు ఎనిమిది యూనిట్లను కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. మొత్తం కాకున్నా మెజార్టీ యూనిట్లు అమ్ముడైనందున తునికాకు సేకరణ ఆశించిన స్థాయిలో ఉంటుందని భావిస్తున్నారు. ఇక ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మం డివిజన్‌లో రెండు, సత్తుపల్లిలోని మూడు యూనిట్లపై కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో జిల్లాలో తునికాకు సేకరణకు మరోమారు టెండర్లు పిలుస్తారా, వదిలేస్తారా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

‘అగ్రి పాలిటెక్నిక్’కు దరఖాస్తుల ఆహ్వానం

అశ్వారావుపేట: వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అశ్వారావుపేట వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లోరా అనూష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 23 వరకు గడువు ఉందని, టీజీ పాలిసెట్‌లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. తమ కళాశాలలో 60 సీట్లు ఉన్నాయని తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ https://pjtau.edu.inలో చూడాలని సూచించారు.

గల్లాపెట్టె గలగల..!

- స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు పెరిగిన ఆదాయం
- గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.206.25 కోట్ల రాబడి
- ఉమ్మడి జిల్లాలో 45,783 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్
- గత ఏడాదితో పోలిస్తే రూ.8 కోట్లు అ'ధనం'



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఈ ఏడాది గణనీయమైన ఆదాయం సమకూరింది. ఉమ్మడి జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 2024 – 25 ఏడాదిలో 45,783 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.206.25 కోట్లు వచ్చాయి. 2023 – 24తో పోలిస్తే ఇది రూ.8 కోట్లు అదనమే అయినా.. 2022 – 23తో పోలిస్తే మాత్రం కాస్త తగ్గుముఖం పట్టింది. ఇక గత ఆర్థిక సంవత్సరం కంటే తాజాగా ముగిసిన సంవత్సరంలో డాక్యుమెంట్లు పెరగడంతో అదేస్థాయిలో ఆదాయం నమోదైంది. 2024 – 25లో రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత మూడు జిల్లాల్లోనే రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం పెరగ్గా.. అందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా కూడా ఉంది.

11 కార్యాలయాలు..

ఉమ్మడి జిల్లాలో ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఖమ్మంరూరల్, కూసుమంచి, మధిర, సత్తుపల్లి, వైరా, కల్లూరు, కొత్తగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, ఇల్లెందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో 45,783 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయగా రూ.206.25 కోట్ల ఆదాయం వచ్చింది. స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో ఈ ఆదాయం నమోదైంది. 2023 –24లో 44, 201 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ ద్వారా రూ.198.21 కోట్ల ఆదాయం సమకూరింది.

తగ్గిన రియల్ బూమ్..

హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల తర్వాత ఖమ్మంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగేది. కానీ కొద్ది నెలలుగా ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిపోయింది. ఖమ్మం చుట్టుపక్కల, రూరల్ ప్రాంతాల్లో కొద్దో గొప్ప వ్యాపారం నడుస్తున్నా.. జిల్లా కేంద్రంలో మాత్రం నామమాత్రమైంది. భూముల క్రయవిక్రయాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్లూ జరగలేదు. రెండేళ్ల క్రితం 50వేలకు పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగితే, గతేడాది నుంచి 50 వేల లోపే అవుతుండడం గమనార్హం. అయితే ఖమ్మంలో ప్రధాన రహదారుల వెంట ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం కొంత ఆశాజనకంగా ఉన్నట్లు తెలుస్తోంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తయితే మళ్లీ వ్యాపారం ఊపందుకుంటుందని, తద్వారా రిజిస్ట్రేషన్లు పెరుగుతాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

2020-21 నుంచి డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్, ఆదాయం ఇలా..

ఏడాది	డాక్యుమెంట్లు	ఆదాయం
2020-21	50,276	రూ. 100,05,20,114
2021-22	57,570	రూ. 206,68,18,974
2022-23	47,102	రూ. 227,34,80,000
2023-24	44,201	రూ. 198,21,00,000
2024-25	45,783	రూ. 206,25,00,000

రూ.250 కోట్ల లక్ష్యం

ప్రభుత్వం ఈ ఏడాది (2025 – 26) స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా భారీగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రణాళికలు చేస్తోంది. జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించి ఆ మేరకు ఆదాయం వచ్చేలా నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా నుంచి 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.250 కోట్లకు పైగా ఆదాయం వచ్చేలా లక్ష్యాలను నిర్దేశించనున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి త్వరలోనే జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు ఆదేశాలు అందనున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

స్వల్పంగా పెరిగిన ఆయిల్‌పాం గెలల ధర

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పాం టన్ను గెల ధర స్వల్పంగా పెరిగిందని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. టన్ను ధర ఫిబ్రవరిలో రూ.20,871 ఉండగా రూ.129 పెరిగి రూ.21,000కి చేరిందని, మార్చి నుంచి సేకరించిన గెలలకు ఈ ధర అమలు చేస్తామని ఆయన చెప్పారు. కాగా, టన్ను ధర పెరగడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పీఆర్ డీఈగా నాగేందర్ బాధ్యతల స్వీకరణ


నాగేందర్

చుంచుపల్లి: పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం కొత్తగూడెం డివిజనల్ ఇంజనీర్‌గా జె.నాగేందర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ డీఈగా పనిచేసిన సత్యనారాయణ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. దీంతో డీఈగా నాగేందర్‌కు పదోన్నతి ద్వారా అవకాశం దక్కింది. నాగేందర్ 2015–17 వరకు కొత్తగూడెం మున్సిపాలిటీలో, తరువాత 2018–24 వరకు చుంచుపల్లి ఏఈగా పనిచేస్తూనే నాలుగు నెలల కిందట డీఈగా పదోన్నతి పొందారు. డీఈ నాగేందర్‌ను ఈఈ శ్రీనివాసరావు, పలువురు ఏఈలు, కాంట్రాక్టర్లు, ప్రజా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా కిరణ్‌రాజ్‌కుమార్


సీఎంఓతో ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మెయిన్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా ఆర్జీ–1 ఏరియాలో ఏసీఎంఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.కిరణ్‌రాజ్‌కుమార్‌ను యాజమాన్యం నియమించగా.. ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఏసీఎంఓ ఎం.ఉష, డీవైసీఎంఓ జి.సునీల, డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది, ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ నాయకులు జి.వీరస్వామి, గట్టయ్య, సుధాకర్, శేషగిరిరావు, మధు, కృష్ణ, హీరాలాల్, ప్రసాద్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన కల్తీ ప్రకాష్

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పదో తరగతి పరీక్షలు పూర్తి చేసుకున్న మాణిక్యారం గ్రామానికి చెందిన ఈసం సిద్ధార్థ్, ఇటీవలే ఇంటర్ పరీక్షలు పూర్తి చేసుకున్న అదే గ్రామానికి చెందిన పానక విష్ణు కొమరారానికి బైక్‌పై బయలుదేరారు. ముత్తారపుకట్ట గ్రామానికి చెందిన కల్తీ ప్రకాష్ గుండాల మండలం వెన్నెలబైలు గ్రామంలో వ్యవసాయ పనులు ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. రెండు బైక్‌లు కొమరారం శివారులో ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కల్తీ ప్రకాష్‌ను 108లో ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. ఈసం సిద్ధార్థ్‌ను కుటుంబ సభ్యులు ఇల్లెందులోని ప్రైవేట్ ఆస్పత్రికి, పానక విష్ణును కొమరారం పీహెచ్‌సీకి తరలించారు.

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు

ఖమ్మంవైద్యవిభాగం: విద్యార్థులు సైబర్ నేరాల బారిన పడొద్దని సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీందర్ సూచించారు. ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో బుధవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నకిలీ యాప్‌లు, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఈ మెయిల్, ఫేస్‌బుక్ ఖాతాలతో పాటు బెట్టింగ్ గేమ్‌ల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశముందని తెలిపారు. గుర్తుతెలియని సైట్లు, వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలనానరు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930కు ఫోన్ చేయడం లేదా www. cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని డీఎస్పీ తెలిపారు. ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, సరిత పాల్గొన్నారు.

ఆదాయం అదుర్స్

లక్ష్యాన్ని మించి వసూలు చేసిన మార్కెట్ కమిటీలు

- ఆరు ఏఎంసీల నుంచి రూ.22.66 కోట్ల రాబడి



బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్

బూర్గంపాడు: జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్ కమిటీలు గతేడాది నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాయి. గతేడాది జిల్లావ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్‌ల నుంచి రూ.21.69 కోట్ల ఆదాయాన్ని సాధించాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. మార్చి 31 వరకు ఈ లక్ష్యాలను చేరుకోవాల్సి ఉంది. అయితే జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలు నిర్దేశించిన లక్ష్యాలను మించి రాబడి సాధించాయి. జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్‌లు వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభుత్వం విధించే ఒక శాతం మార్కెట్ ఫీజును వసూలు చేయటంలో సఫలీకృతమయ్యాయి. జిల్లాలోని బూర్గంపాడు, ఇల్లెందు, కొత్తగూడెం, దమ్మపేట, భద్రాచలం, చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీలు తమకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేశాయి. ఒక్క చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాత్రం లక్ష్యానికి కొంత వెనుకబడి ఉంది. గతేడాది ప్రభుత్వం బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ.5.86 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. బూర్గంపాడు ఏఎంసీ మార్చి 29వ తేదీ నాటికి రూ.6.41 కోట్ల రాబడి సాధించింది. ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఇచ్చిన రూ.4.64 కోట్ల లక్ష్యాన్ని అధిగమించి రూ.5.71 కోట్ల ఆదాయం రాబట్టింది. కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీకి విధించిన రూ.3.30 కోట్ల లక్ష్యానికి గాను రూ.3.26 కోట్ల ఆదాయంతో లక్ష్యం దిశగా ఉంది. దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీకి నిర్దేశించిన రూ.3.25 కోట్ల లక్ష్యాన్ని అధిగమించి రూ.3.87 కోట్ల ఆదాయం సాధించింది. భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీకి పెట్టిన రూ.2 కోట్ల లక్ష్యాన్ని అధిగమించి రూ.2.06 కోట్ల ఆదాయాన్ని రాబట్టింది. చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీకి విధించిన రూ.2.62 కోట్ల టార్గెట్‌కు రూ.1.95 కోట్ల ఆదాయం సాధించి లక్ష్యసాధనలో వెనుకబడింది. జిల్లాకు మొత్తంగా విధించిన రూ.21.69 కోట్ల టార్గెట్‌కు గాను రూ.22.66 కోట్ల ఆదాయంతో లక్ష్యాన్ని అధిగమించింది.

పత్తి, వరి, మిర్చిపైనే ఆదాయం

జిల్లాలో రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులపై వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఒక శాతం మార్కెట్ ఫీజును వసూలు చేస్తాయి. జిల్లాలో ఎక్కువగా పండే పత్తి, వరి, మిర్చి పంటలపై మార్కెట్ కమిటీలకు ఎక్కువ ఆదాయం వస్తుంది. బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీకి జామాయిల్, సుబాబుల్ కర్రతో అధిక ఆదాయం వస్తుంది. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీకి వచ్చే జామాయిల్, సుబాబుల్ కర్రపై విధించే మార్కెట్ ఫీజుతో బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీకి జిల్లాలోనే అధిక ఆదాయం వస్తుంది. ఈ ఏడాది మిర్చి కోతలు ఆలస్యమవటం, మిర్చికి ధర తక్కువగా ఉండటంతో రైతులు మిర్చి అమ్మకాలు జరపటం లేదు. ఈ పరిస్థితులు చర్ల మార్కెట్ కమిటీ లక్ష్యసాధనలో కొంత వెనుకబడినట్లుగా తెలుస్తోంది. వచ్చే ఏడాది జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీల టార్గెట్‌ను రూ.25 కోట్లకు పెంచే అవకాశాలున్నాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పంటల క్రయ విక్రయాలు జరిపితే ఆదాయం మరింత పెరిగే అవకాశాలున్నాయి. జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు. ట్రేడర్లను, వ్యాపారులను ఆ దిశగా ప్రభుత్వం ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

సిబ్బంది సహకారంతోనే లక్ష్యసాధన



జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్ కమిటీల అధికారులు, సిబ్బంది పనితీరుతో ప్రభుత్వ లక్ష్యాలను చేరుకున్నాం. జిల్లాలో మొత్తంగా లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని సమకూర్చుకున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయం మరింతగా పెంచుకునేలా దృష్టి సారిస్తాం.

–నరేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి

విద్యుదుత్పత్తిలో కేటీపీఎస్ భేష్

- ఏడో దశ కర్మాగారానికి జాతీయ స్థాయిలో మూడో ర్యాంక్
- జెన్‌కోలో ప్రథమ స్థానం


పాల్వంచలోని కేటీపీఎస్ 7వ దశ కర్మాగారం

పాల్వంచ: గత ఆర్థిక సంవత్సరం విద్యుత్ ఉత్పత్తిలో కేటీపీఎస్ ఆశాజనక ఫలితాలు సాధించింది. సూపర్ క్రిటికల్ సామర్థ్యం గల 800 మెగావాట్ల ఏడో దశ కర్మాగారం తన ప్రత్యేకతను మరోసారి చాటుకుంది. 79.04 పీఎల్‌ఎఫ్(ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) సాధించి దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. గుజరాత్‌లోని లారా స్టేషన్ ప్రథమ, ఒడిశాలోని దార్లపల్లి ద్వితీయ స్థానాల్లో ఉండగా కేటీపీఎస్ ఏడో దశ తృతీయ స్థానంలో ఉంది. టీజీ జెన్‌కోలో మాత్రం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ కర్మాగారం 2022 – 23లో 4211.3262 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించగా 2023 – 24లో 6,011.2768 మిలియన్ యూనిట్లు, 2024 – 25లో 5,538.9876 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించింది. ఇక 2023 – 24లో పీఎల్‌ఎఫ్‌లో 85.54 శాతం ఉండగా ఈ సారి 79.04 సాధించింది. బొగ్గు వినియోగం గతంలో 30,45,889 మెట్రిక్ టన్నులకు గాను 2024 – 25లో 29,88,125.90 మెట్రిక్ టన్నులకు తగ్గించారు.

టీజీ జెన్‌కోలో 5, 6 దశలూ రికార్డే..

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉన్న నేపథ్యంలో కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారం అత్యధిక రోజులు బ్యాక్ డౌన్‌లో నడిచింది. దీంతో పీఎల్‌ఎఫ్ తగ్గగా, నిరంతరాయ ఉత్పత్తిలో మాత్రం రికార్డ్ సాధించింది. పీఎల్‌ఎఫ్ 93.45 శాతంతో జెన్‌కోలో ద్వితీయ స్థానంలో నిలిచింది. 3,054.680 మిలియన్ల విద్యుత్ ఉత్పత్తి సాధించింది.

సమష్టి కృషితో రికార్డ్ స్థాయిలో ఉత్పత్తి



సమష్టి కృషితో రికార్డ్ స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి సాధించాం. జెన్‌కోలో ప్రథమ స్థానం, సూపర్ క్రిటికల్ టెక్నాలజీ గల 800 మెగావాట్లలో జాతీయ స్థాయిలో తృతీయ స్థానం సాధించాం. ఇందుకు సహకరించిన సిబ్బంది, అధికారులకు ధన్యవాదాలు. వచ్చే ఏడాది మరింత ఉత్పత్తి సాధించేలా కృషి చేస్తాం.

– కె.శ్రీనివాసబాబు, ఏడో దశ సీఈ

మోరంపల్లిబంజర సంత వేలం రూ.33.50 లక్షలు


మోరంపల్లిబంజర సంత వేలంపాట నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ

బూర్గంపాడు: మోరంపల్లిబంజర సంత వేలంపాట రూ.33.50 లక్షలకు ఖరారైంది. డీఎల్‌పీఓ సుధీర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంత వేలం పాటలో ఆరుగురు పాల్గొన్నారు. ప్రతి గురువారం, శుక్రవారం నిర్వహించనున్న పశువుల సంత, కూరగాయల సంతకు సంయుక్తంగా నిర్వహించిన వేలం పాటను బానోత్ రవీందర్ రూ.33.50 లక్షలకు దక్కించుకున్నాడు. పంచాయతీ కార్యదర్శి భవాని, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా, బూర్గంపాడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే వారపు సంత వేలంపాటను బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీఓ బాలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలంపాటను జక్కం శ్రీనివాసరావు రూ.2.54 లక్షలకు దక్కించుకున్నాడు. ప్రతి బుధవారం బూర్గంపాడులో నిర్వహించే సంత వేలంపాటలో ఎనిమిదిమంది పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి బర్ల రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన గూడ్స్ రైలు

ఇల్లెందు, పేరుపల్లి రైల్వే గేట్ల వద్ద ఇబ్బందులు పడిన వాహనదారులు


కారేపల్లిలో ఇల్లెందు (2కేకే) రైల్వే గేటు వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

కారేపల్లి: సిగ్నల్స్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో.. కారేపల్లిలోని ఇల్లెందు, పేరుపల్లి రైల్వే గేట్ల వద్ద గూడ్స్ రైలు నిలిచిపోయిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కొత్తగూడెం నుంచి వయా కారేపల్లి రైల్వే జంక్షన్ మీదుగా డోర్నకల్ వైపు బొగ్గులోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు ఇల్లెందు (2కేకే) రైల్వే గేట్, పేరుపల్లి (1కేకే) రైల్వే గేట్‌లకు సమీపించి సిగ్నల్స్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. దీంతో ఈ రెండు గేట్లు తెరుచుకోకపోవటంతో సుమారు గంట పాటు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా.. ఈ రెండు రైల్వే గేట్లకు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి లేదా అండర్ లోలెవల్ బ్రిడ్జిలను నిర్మించాలని ప్రజాప్రతినిధులను, రైల్వే ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నేటి నుంచి హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: 2024లో నూతనంగా పదోన్నతి పొందిన గెజిటెడ్ హెచ్‌ఎంలు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు గురువారం, శుక్రవారం వృత్త్యంతర శిక్షణ అందించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ సబ్జెక్టులకు పాత కొత్తగూడెంలోని జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలోనూ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు, భౌతికశాస్త్రం సబ్జెక్టులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆనందఖనిలోనూ, ఇంగ్లిష్, గణితం, వ్యాయామ ఉపాధ్యాయులకు బూడిదగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ, సాంఘికశాస్త్రం, బయాలజీ ఉపాధ్యాయులకు పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఉంటుందని తెలిపారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

మొగలాయిలను ఎదిరించిన వీరుడు

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సభలో అదనపు కలెక్టర్


పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): హస్తిన పాలకుల వెన్నులో వణుకు పుట్టించిన తొలి తెలంగాణ తేజం, గోల్కొండ కోటపై మొగలాయిల పెత్తనాన్ని ధిక్కరించి సమ సమాజ స్థాపనకు ప్రాణాలను పణంగా పెట్టిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన, పేదల పాలిట ఆపద్బాంధవుడు అని, క్షత్రియుడే కత్తి పట్టాలన్న సూత్రాన్ని ఆయన మార్చారని, సబ్బండ వర్గాల బలగంతో రాజ్యాధికారం సంపాదించాడని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ భూమి ఆక్రమణ?


ఆక్రమణకు గురైనట్లు భావిస్తున్న అటవీ భూమి

అశ్వారావుపేట: మండలంలోని వినాయకపురం చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం వెనుక అటవీ భూభాగం ఆక్రమణకు గురైనట్లు సమాచారం. దమ్మపేట రేంజ్ పరిధిలోని తిరుమలకుంట బీట్ పరిధిలో ఉన్న అటవీ భూమి సరిహద్దు దాటి కొందరు ఆక్రమణకు పాల్పడినట్లు తెలిసింది. అటవీ భూమి సరిహద్దును చూపే కాంపౌండ్ దిమ్మెలను దాటి ఫెన్సింగ్ నిర్మించి మరీ వ్యవసాయం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అటవీ శాఖకు చెందిన దమ్మపేట, అశ్వారావుపేట రేంజ్‌లు, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ సరిహద్దులుగా ఉంటాయి. దీంతో ముగ్గురి మధ్య ఉన్న అటవీ భూభాగాన్ని వినాయకపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు, కొందరు అధికారులు కబ్జా చేసి ఏళ్ల తరబడి వినియోగించుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని దమ్మపేట రేంజ్ అధికారి దృష్టికి తీసుకువెళ్లగా బీట్ అధికారిని విచారణకు పంపుతామని, ఆక్రమణదారులను ఖాళీ చేయిస్తామని చెప్పారు.

ఇసుక లారీ పట్టివేత


పోలీసులు సీజ్ చేసిన టిప్పర్

అశ్వారావుపేటరూరల్: ఏపీ రాష్ట్రం నుంచి అక్రమంగా తెలంగాణలోకి రవాణా చేస్తున్న ఓ ఇసుక లారీని బుధవారం తెల్లవారుజామున స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ యయాతిరాజు కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా తాటిపూడి నుంచి టిప్పర్‌లో సుమారు 15 టన్నుల ఇసుకను అశ్వారావుపేటకు తీసుకురాగా, సమాచారం మేరకు గ్రామ శివారులో పట్టుకున్నారు. టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేయగా, ఏపీలోని ఏలూరు జిల్లా పోలవరం మండలం కొత్త పట్టిసీమ గ్రామానికి చెందిన లారీ యజమాని గంటా కొండబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడి


గుడుంబా స్థావరాలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పినపాక: మండలంలోని దుగినేపల్లి, చెగర్షల అటవీ ప్రాంతంలో గుడుంబా తయారు చేస్తున్న స్థావరాలపై ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. పలుచోట్ల సుమారు 500 లీటర్ల బెల్లం పానకం, 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బట్టీలను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురికి జరిమానా

కొత్తగూడెంటౌన్: డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ఐదుగురికి జరిమానా విధిస్తూ కొత్తగూడెం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు బుధవారం తీర్పు చెప్పారు. పాల్వంచటౌన్ ఎస్‌ఐ సుమన్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు అతిగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా అధిక మోతాదులో మద్యం సేవించినట్లు తేలింది. వారిని పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టగా విచారణ అనంతరం ఐదుగురికి రూ.6,500 జరిమానా విధిస్తూ జడ్జి మెండు రాజమల్లు తీర్పు ఇచ్చారు. అనంతరం సదరు వ్యక్తులు కోర్టులో జరిమానా చెల్లించారు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి


వెంకటకృష్ణారెడ్డి (ఫైల్)

దుమ్ముగూడెం: ట్రాక్టర్ బోల్తాపడి మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పడిగపాటి వెంకటకృష్ణారెడ్డి (39) మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గణేశ్ కథనం ప్రకారం.. వెంకటకృష్ణారెడ్డి తన వ్యవసాయ అవసరాల నిమిత్తం ట్రాక్టర్ కొనుగోలు చేశారు. తన ట్రాక్టర్‌పైనే పొలానికి వెళ్తూ ముట్ల వాగు బ్రిడ్జి సమీపానికి వెళ్లేసరికి అదుపుతప్పి ఎడమవైపు ఉన్న కాల్వలో పడిపోయింది. ట్రాక్టర్ కింద పడిన వెంకటకృష్ణారెడ్డి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అటుగా వాకింగ్ చేస్తున్న రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వ్యక్తులు ఘటనను చూసి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: మద్యం మత్తులో పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని దంతలబోరు ఎస్సీకాలనీలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన వ్యవయ కూలీ కాటూరి సుందరం బుధవారం మద్యం మత్తులో ఇంట్లో గొడవ పడి పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెంనకు తరలించారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీలో తనకు స్థానం కల్పించలేదనే అక్కసుతో ఆలయ పూజారిని దుర్భాషలాడాడని, బోర్డును ధ్వంసం చేశాడమని తల్లాడ రామాచారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాంపల్లి వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేశ్ వెల్లడించారు.

గుట్కా ప్యాకెట్లు, గుడుంబా స్వాధీనం

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం, పోచారంతండాల్లోని పలు దుకాణాల్లో బుధవారం రాత్రి కొమరారం పోలీసులు తనిఖీ చేశారు. మర్రిగూడెం గ్రామానికి చెందిన కమల్ ఇంటి నుంచి రూ.1,800 విలువ చేసే గుట్కా ప్యాకెట్లు, పోచారంతండాలో రాంబాబు ఇంట్లో ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య


రాజు (ఫైల్)

పాల్వంచ: పట్టణంలోని ఓ ల్యాబ్ టెక్నీషియన్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. గుండాల మండలం మార్కోడుకు చెందిన బొందు రాజు (25) పాల్వంచలోని ప్రైవేట్ ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న ఎక్స్‌రే ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంచికంటినగర్ ఏరియాలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చేతి నరాలు కట్ చేసుకుని, ఐరన్ రాడ్‌కు వైర్‌తో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య జ్ఞానేశ్వరి, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. పోలీసులు విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

వృక్షం .. ప్రకృతి గీసిన చిత్రం



ఆకులన్నీ రాలిన వృక్షం.. ఆ వెనుక లేలేత గులాబీ వర్ణంలో వినీలాకాశం.. ములకలపల్లిలో బుధవారం సాయంత్రం ఆవిష్కృతమైన దృశ్యం ఇది. సాయం సంధ్యవేళ ప్రకృతి గీసిన చిత్రంలా కనిపించిన ఈదృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– ములకలపల్లి